
హైదరాబాద్ వార్త

# జిహెచ్ఎంసిలో ఘనంగా మహిళా దినోత్సవం

**-హాజరైన మేయర్, డిప్యూటీ మేయర్, మహిళా ఉద్యోగులు**



మహిళా దినోత్సవం సందర్భంగా డిప్యూటీమేయర్‌తో కలిసి ర్యాంప్‌వాక్ చేస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ

**హైదరాబాద్, మార్చి 7,ప్రభాతవార్త:** మహిళలకు మహిళలే స్నేహితులని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. దీనికి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, కమిషనర్ ఇలంబర్తి, ఇతర మహిళా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ...పలు రంగాలలో విజయాలు సాధించి ఉన్నతంగా రాణించిన మహిళామణులను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. ప్రతి మహిళలో ఏదో ఒక నైపుణ్యత ఉంటుందని దానికి మెరుగు పెట్టి అందులో రాణించాలన్నారు. ప్రతి ఇంటిలో తల్లి తన పిల్లలకు క్రమశిక్షణ నేర్పాలని, చదువు, సంస్కారంతో పాటు సభ్య సమాజంలో ఏ విధంగా నడుచుకోవాలో నేర్పాలని సూచించారు. తల్లిగా ప్రతి మహిళ తమ పిల్లల విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ... మహిళలు ఐక్యంగా ఉన్నప్పుడే ఏదైనా సాధించగలుగుతారన్నారు. ముఖ్యంగా మహిళలు తమ ఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకోవానల్నారు. మహిళ బాగుంటేనే కుటుంబం, సమాజం బాగుంటుందన్నారు. కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ...ఇంటి నిర్వహణను మొదలుకొని ఒక పెద్ద సంస్థను నిర్వహించడం వరకు మహిళలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. అన్ని రంగాల్లో పురుషుల కంటే మహిళలు ఉన్నతంగా రాణిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి మహిళా తల్లిగా మొదలుకొని అన్ని పాత్రలను అవలీలగా నిర్వహిస్తూ సమాజంలో కీలకంగా మారిందన్నారు. ఈ సందర్భంగా ఆయన బాల్యంలో తన తల్లి ఇంటి నిర్వహణలో ఏవిధంగా కష్టపడేదన్న విషయాన్ని, అదేవిధంగా ఆయన జీవిత భాగస్వామి కోఆర్డినేషన్ ను గుర్తు చేసుకున్నారు. జీహెచ్ఎంసీలో మహిళల హెల్త్ చెకప్ కు సంబంధించి రెగ్యులర్ గా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఫైనాన్స్ అడిషనల్ కమిషనర్‌కు సూచించారు. అంతకు ముందు మహిళా ఉద్యోగులు ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు పంకజ, సుభద్రాదేవి, అలివేలు మంగతాయారు, సరోజ, గీతా రాధిక, జాయింట్ కమిషనర్ ఉమా ప్రకాష్, సి.ఎం.హెచ్.ఓ డా.పద్మజ, డి సి ప్రశాంతి వివిధ విభాగాల మహిళా హెచ్.ఓ.డి లు, డి.సి లు, ఏ.ఎం.సి లు, ఉద్యోగినులు, శానిటరీ మహిళా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# జూపార్కులో జంతువులు,పక్షులకు ప్రత్యేక ఏర్పాట్లు





**చార్మినార్,మార్చి 7 ప్రభాతవార్త :** వేసవి కాలంలో ఎండలు తీవ్రంగా ఉండటంతో హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులోని జంతువులను ఎండ వేడిమి నుంచి కాపాడటానికి జూ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈసంవత్సరం రోజు,రోజుకు ఎండలు మండుతున్నాయిజూ పార్కులో ఉన్న జంతువుల సంరక్షణ కోసం ఎండ తగల కుండ ఉండేలా ఎన్‌క్లోజర్లు వద్ద 60 కూలర్లు, ఎయిర్ ఫ్యాన్లు ఏర్పాట్లు చేశారు. రోజుకు మూడు సార్లు జంతువులకు చల్లని నీరును పైపులతో సిబ్బంది చల్లు తున్నారు. ఎన్‌క్లోజర్లు వద్ద రెండు వందల రెయిన్ గన్స్, పక్షులు ఎన్‌క్లోజర్లు



వద్ద 2000 ఫగ్గర్స్, జంతువులు, పక్షుల ఎన్‌క్లోజర్ల షెల్టర్లు వద్ద తుంగ గడ్డి కప్పి వేడి లోపలకు తగల కుండ అన్ని చర్యలు తీసుకున్నారు. పక్షులు, చిలుకలు, కోతులకు చల్ల దనం కోసం పలు రకాల పండ్లు తినిపిస్తున్నారు. జూ పార్కు సిబ్బంది మూడు సార్లు చల్లని నీటిని పక్షులపై చల్లుతున్నారు. వేసవి కాలంలో జూపార్కులోని సింహాలు, పులులుతో పాటు ఇతర జంతువులకు, అదే విధంగా వివిధ రకాల పక్షులు, చిలుకలు, పక్షులకు సైతం గ్లూకోన్ -డి, విటామిన్ సి, ఎల క్ట్రోకల్ ఫొడర్, బి.కాంప్లెక్స్ ట్యాబ్‌లెట్లను నీటిలో కలిపి జూ సిబ్బంది అందిస్తున్నారు. వేసవి కాలం సందర్భంగా జూపార్కులోని జంతువులు, పక్షులను ఎండ వేడిమి నుంచి కాపాడటానికి అన్ని ఏర్పాట్లు చేశామని జూపార్కు క్యూరేటర్ జె.వసంత తెలిపారు.

# రంగురంగుల బొమ్మలు..కనిపించని చిరునామాలు

**-నాసిరకం చిరుతిళ్లపై నియంత్రణ కరువు**
**-కల్తీ నూనెలతో తినుబండారాల తయారీ**
**-ప్యాకింగ్‌కు ఆకర్షితులవుతున్న చిన్నారులు**
**-అధికారులు పట్టించుకోకపోతే పెను ప్రమాదమే..**



**హైదరాబాద్, మార్చి 7,ప్రభాతవార్త:** పీలే గాలి..తినే తిండి..తాగే నీరు ఇలా అన్ని కల్తీమయం. డబ్బు సంపాదించేందుకు పలువురు అక్రమ మార్గాలు అనుసరిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. అచ్చం అసలు పోలిన విధంగా నకిలీవి తయారు చేసి జనం మీదకు వదులుతున్నారు. ఆఖరుకు చిన్నారుల ఆహారాన్ని సైతనం కల్తీ చేస్తూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. చాక్లెట్, బిస్కెట్ చిప్స్, నూడిల్స్, బేకరీ ఫుడ్స్, డ్రైఫ్రూట్స్ ఆదేదీ కల్తీకి అనర్హం అన్నట్లు వ్యవహరిస్తున్నారు. వాస్తవం తెలియక తల్లిదండ్రులు పిల్లలకు కోరిందే తడవుగా ప్రేమతో తినిపిస్తూ ఆనారోగ్యం పాలు చేస్తున్నారు. వస్తువేదైనా ఆకర్షనీయంగా కనిపిస్తే చాలు చిన్నపిల్లలు ఆకర్షితులవుతారు. ఇదే అదునుగా భావిస్తున్న పలు కంపెనీలు కల్తీ పరదార్థాలతో మార్కెట్లోకి విస్తురిస్తున్నాయి. ప్రధానంగా విద్యాసంస్థలు ఉన్న ప్రాంతాల్లోని దుకాణాలలో ఇవి ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీంతో వీటిని తిన్న విద్యార్థులు, చిన్న పిల్లలుఅనారోగ్యం భారినపడి ఆసుపత్రి పాలవుతున్నారు. రంగురంగు ప్యాకేట్ల రూపంలో ఈనకిలీ చిరుతిళ్లు కనిసిస్తుండటంతో చిన్నపిల్లలు అవే కావాలని మారం చేస్తున్నారు మార్కెట్‌లో పుట్టగొడుగుల్లా విషపూరితమైన రసాయనాలతో కూడిన చిరుతిళ్లు పుట్టుకొచ్చి పిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. ఇలాంటి ఆహార పదార్థాలను రాజేంద్రనగర్ సమీపంలోని కాటేదాన్‌లో గుట్టుచప్పుడు కాకుండా తయారు చేసి ఇతర ప్రాంతలకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఈనాసీరకం తినుబండారాలపైనే రోజూ లక్షల్లో వ్యాపారం జరుగుతుందంటే అతియశయోక్తి కాదు. ముఖ్యంగా శివారు ప్రాతమైన ఎల్బీనగర్, బిఎన్‌రెడ్డి, సంతోష్‌నగర్, అలాగే బాల్‌నగర్, షాపూర్ మల్లాపూర్ లాంటి ప్రాంతాల్లో ఇలాంటి నాసీరకమై కల్తీ ఆహార పదార్థాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అయినా సంబంధిత కల్తీ నియంత్రణ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

**పుట్టగొడుగుల్లా నాసీరకం తినుబండారాలు..**

మంచి కంపెనీకి చెందిన చిప్స్ 100గ్రాములకు 20 రూపాయలు అని ప్యాకేట్ మీద ప్రకటిస్తే ..స్థానికంగా తయారైన చిప్స్ కేవలం 10రూపాయలకే అందుబాటులో ఉంచుతున్నాయి. అయితే ఈచిప్స్‌లో నాణ్యత ఎంత వరకు ఉంటుందనేది ప్రశ్నార్థకం, క్వాంటిటీ ఎక్కువగా వస్తుండటంతో వీటని కొనుగోలు చేసేందుకు అందరూ ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. మార్కెట్‌లో బ్రాండెడ్ కంపెనీలను మినహాయిస్తే పలు నాసీరకం కంపెనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. తినుబండారాలకు రంగులు, చాట్ మసాల వేసి రంగు రుచిని జోడిస్తున్నారు. దీంతో పిల్లలు వాటినే ఇష్టంగా తింటున్నారు. పిల్లలు కూడా ఒకసారి అలవాటు పడ్డారు అంటే మళ్లీ వాటిని మరవడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు.

**రంగురంగుల బొమ్మలు.. కనిపించని చిరునామాలు**

చిన్నారులను ఆకర్షించేందుకు రకరకాల బొమ్మలను ముద్రించి అమ్మకాలు కొనసాగిస్తున్నారు. ఇంకా కొన్ని ప్యాకేట్లలో రూపాయి కాయిన్స్, చిన్నచిన్న బొమ్మలు పెట్టి ప్యాకింగ్ చేస్తున్నారు. తయారు చేసే తినుబండారాలపై హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డిలకు చెందిన కంపెనీలుగా పేర్కొంటూ. పేరు, పదార్థం, బరువు మాత్రమే ముద్రిస్తున్నారు. ఎక్కడకూడా గడువుతేదీ, సంప్రదించాల్సిన నెంబర్లు ఉండకుండడా జాగ్రత్త పడుతున్నారు. ఎక్కువగా కిరణాలు, గల్లీ దుకాణాల్లో ఈనాసీరకం పదార్థాలను సరఫరా చేస్తున్నారు. మరీ కొందరు పెద్ద కంపెనీల పేర్లను ప్యాకేజీపై ముద్రిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. నిజానికి చిరుతిళ్ల తయారీదారులు తప్పనిసరిగా ప్రభుత్వం నుండి అనుమతులు తీసుకోవాలి. ఆహార పదర్థాల నిపుణులను, న్యూట్రీషియన్స్‌తో ఎప ప్పటికప్పుడు తయారీ పదర్థాలను పరీక్షించాలి. ఇలా అన్ని నిబధనలు పాటించిన వారికే ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా నుండి అనుమతి లభిస్తుంది. కానీ తయారీ దారులు ఇవేవీ పాటించకుండా ఇష్టారాజ్యంగా చిరుతిళ్ల ఉత్పత్తి చేసి దందా కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించిన కల్తీ చిరుతిళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# సమ్మర్ డిమాండ్‌కు 'సైబర్ సిటీ' రెడీ

**-సిఎండి ముషారఫ్ ఫరూఖీ**
**-సర్కిల్ పరిధిలోని సమ్మర్ యాక్షన్ పనుల సమీక్ష**
**-మూడు సబ్ స్టేషన్లలో పిటిఆర్‌లను ఆవిష్కరించిన సీఎండీ**



సబ్‌స్టేషన్‌లో పిటిఆర్‌లను ప్రారంభిస్తున్న సిఎండీ ముషారఫ్ ఫరూఖీ

**హైదరాబాద్, మార్చి 7,ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్ నగరంలో ఐటి కేంద్రంగాఉన్న సైబర్ సిటీ సర్కిల్లో వేసవిలో ఏర్పడే అధిక డిమాండ్ కు తగ్గట్టు విద్యుత్ సరఫరా కు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ అన్ని ఏర్పాట్లు చేపట్టింది. ఈమేరకు శుక్రవారం సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ సైబర్ సిటీ సర్కిల్ పరిధిలో చేపట్టిన సమ్మర్ ఆక్షన్ పనులను సమీక్షించారు. ఈసందర్భంగా పుప్పాల్ గూడా, ఎల్‌అండ్‌టి, హఫీజ్ పెట్ సబ్ స్టేషన్‌లలో అదనంగా ఏర్పాటు చేసిన 12.5 ఎంవిఏ, 8ఎంవిఏ పవర్ ట్రాన్స్ ఫార్మర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భముగా సీఎండీ మాట్లాడుతూ, సైబర్ సిటీ సర్కిల్ పరిధిలో తగ్గట్టుగానే సమ్మర్ ప్రణాళికలో భాగంగా వివిధ సబ్ స్టేషన్లలో అదనంగా 25 పవర్ ట్రాన్స్ ఫార్మర్లు, 128 11 కేవీ ఫీడర్లు, 4 33 కేవీ ఫీడర్లు, 232 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్ నగరం లోని ఇతర సర్కిళ్ళతో పోల్చుకుంటే సైబర్ సిటీ సర్కిల్ లోని గచ్చి బౌలి, కొండాపూర్ మరియు ఇబ్రహీం బాగ్ డివిజన్ల పరిధిలో విద్యుత్ డిమాండ్ ప్రతి ఏటా 35 శాతం పెరుగుతుందన్నారు. గతంలో పెరిగిన డిమాండ్ కు తగ్గట్టు ఏర్పాట్లు చేయకపోవడం వలన గతేడాది కొన్ని ప్రాంతాల్లో ఓవర్ లోడింగ్ సమస్యలు ఏర్పడ్డాయని, ఈ సారి అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు పలు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. ఈ పర్యటనలో సీఎండీ తో పాటు డైరెక్టర్ ఆపరేషన్స్ నర్సింహులు, సైబర్ సిటీ ఎస్ఈ చంద్ర శేఖర్ డిఈ, ఏడీఈ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కనీస వేతనాల సవరణకై లేబర్ కమిషనర్ ఆఫీస్ వద్ద ధర్నా

**చిక్కడపల్లి, మార్చి 7 ప్రభాతవార్త:** కనీస వేతనాల సవరణ చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని కార్మిక శాఖ కమీషనర్ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి నిరసన వ్యక్తం చేసింది. ఈ ధర్నా కార్యక్రమంలో హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి తదితర జిల్లాల నుండి కార్మికులు హాజరయ్యారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ అధ్యక్షతన జరిగిన ఈ ఆందోళన కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శులు జె. వెంకటేష్, ఎం. వెంకటేష్, జె. చంద్రశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. ఈశ్వర్రావు, వి.ఎస్. రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు వై. సోమన్న, జె. కుమారస్వామి, పి. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ధర్నానుద్దేశించి రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు మాట్లాడుతూ పెరిగిన ధరలకనుగుణంగా కనీస వేతనం రూ.26వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం 10సంవత్సరాల కాలంలో వేతనాలు పెంచకుండా కాలయాపన చేసి మోసం చేసినందుకు కార్మికవర్గం తగిన గుణపాఠం చెప్పిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే దారిలో పయనిస్తే బిఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్కు కూడా పడుతుందని హెచ్చరించారు. అనంతరం జాయింట్ కమీషనర్ ఆఫ్ లేబర్ రంగారెడ్డి జోన్ వారిని యూనియన్ రాష్ట్ర ప్రతినిధి బృందం వినతి పత్రం అందజేసింది. రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఎస్. రావు కార్మిక శాఖ అధికారులు చెప్పిన అంశాలను కార్మికుల దృష్టికి తీసుకొచ్చారు. హైదరాబాద్ అధ్యక్షులు జె. కుమారస్వామి వందన సమర్పణ చేశారు.

# మెకానిక్ దుకాణంలో అగ్ని ప్రమాదం

**-రెండు బైకులు దగ్ధం**



అగ్ని ప్రమాదంలో కాలి పోయిన రెండు ద్విచక్ర వాహనాలు

**మైలార్‌దేవ్‌పల్లి,మార్చి 7 ప్రభాతవార్త :** మైలార్‌దేవ్‌పల్లిలోని ఓ బైక్ మెకానిక్ దుకాణంలో శుక్రవారం అగ్ని ప్రమాదం జరిగింది. స్థానిక ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఉన్న బైక్ రిపేర్ దుకాణంలో మంటలు రావటంతో రెండు వాహనాలు కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. షార్ట్ సర్క్యూట్ వల్లనే అగ్ని ప్రమాదం జరిగి ఉండ వచ్చునని భావిస్తున్నారు. కాగా అగ్ని ప్రమాదం విషయమై ఎటువంటి ఫిర్యాదు రాలేదని ఎస్ఐ పైడి నాయుడు తెలిపారు.

# మద్యం మత్తులో బైక్‌ను ఢీకొట్టిన యువతి

**-సినిమా సీన్ సృష్టించిన తాగుబోతు యువతులు**

**కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 7, ప్రభాతవార్త** ఫుల్‌గా మందుకొట్టి ఒంటి సోయి లేకుండా ఇష్టానుసారం కారు డ్రైవ్ చేస్తూ నడిరోడ్డుపైనే బీభత్సం చేయటంతో ట్రాఫిక్ జాం అయ్యింది. అర గంటపాటు కేపీహెచ్‌బీ ఏరియాలో నడిరోడ్డుపై సినిమా సీన్ సృష్టించారు ఈ తాగుబోతు అమ్మాయిలు. కారులో ముగ్గురు అమ్మాయిలు ఉండగా.. ఈ ముగ్గురూ మందు కొట్టినట్లు చెబుతున్నారు. రంగంలోకి దిగిన పోలీసులు కారులో అమ్మాయిలకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేయగా 200 పాయింట్లపైనే రీడింగ్ వచ్చింది. అంటే ఏ రేంజ్‌లో వాళ్లు మందు కొట్టారో అర్థం అవుతుంది. హైదరాబాద్ నగరంలోని కూకట్‌పల్లిలో మద్యం మత్తులో కారు బీభత్సం సృష్టించింది. కేపీహెచ్బీ మెట్రో స్టేషన్ దగ్గర ద్విచక్ర వాహన దారుని ఢీకొట్టిన కారు.. దీంతో పాటు మద్యం మత్తులో యువతులు హల్ చల్ చేశారు. బైక్ ను ఢీకొట్టడమే కాక సదరు వాహనదారిని యువతులు బెదిరించారు. దీంతో ద్విచక్ర వాహనదారుడు ట్రాఫిక్ పోలీసులు ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేయగా రీడింగ్ 212 పాయింట్లు నమోదైనట్టు తేలింది. ఈ ఘటన జరిగిన ప్రదేశం కెపిహెచ్‌బి పోలీస్ స్టేషన్ కు కూతవేటు దూరంలోనే ఉండటం విశేషం. డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ బైక్స్‌ను ఢీకొట్టటమే కాకుండా.. రోడ్డుపైనే కారు ఆపేసి.. ప్రశ్నించిన వారిపై దాడులకు దిగటంతో వాహనదారులు పోలీసులకు కంప్లయింట్ ఇచ్చారు. ఫొటోలు, వీడియో తీస్తున్న వాళ్లపైనా దాడులు చేశారని చెబుతున్నారు. ట్రాఫిక్ పోలీసుల ఎంట్రీతో వాళ్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేసి కేసు నమోదు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. వీళ్ల ఎవరు.. ఎక్కడి వారు.. ఈ ముగ్గురు అమ్మాయిలు ఏం చేస్తుంటారు.. ఏం చదువుకున్నారు.. మందు ఎక్కడ కొట్టారు. ఎక్కడి నుంచి వస్తున్నారు అనే విషయాలను మాత్రం పోలీసులు కొంచెం గోప్యంగానే ఉంచారు. అమ్మాయిలు కదా..

# ఆస్తిపన్ను బకాయిదారులకు ఊరట

**-ఒకేసారి చెల్లిస్తే వడ్డీపై 90శాతం రాయితీ**
**-ఓటిఎస్ వెసులుబాటు కల్పించిన జిహెచ్ఎంసి**




**హైదరాబాద్, మార్చి 7,ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆస్తి పన్ను చెల్లింపు బకాయిదారులకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. 90 శాతం వడ్డీ మాఫీతో మొత్తం ఒకేసారి పన్ను బకాయిలు చెల్లించేలా మరోసారి ఓటీఎస్ ను అమలు చేస్తున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఓటీఎస్ పథకాన్ని ఉపయోగించుకొని నగరంలోని ఆస్తి పన్ను మొండి బకాయిలున్న వారు పన్ను చెల్లించాలని సూచించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొత్తం ఓటిఎస్ పన్నుతోపాటు వడ్డీ 10 శాతం చెల్లిస్తే సరిపోతుందని వెల్లడించారు. గతేడాది ప్రవేశపెట్టిన ఓటీఎస్ వల్ల సుమారు లక్ష మంది వినియోగదారులు ఆస్తి పన్ను చెల్లించారు. జీహెచ్ఎంసీ ఈ సారి ఆస్తి పన్నుకు సంబంధించి రూ.2 వేల కోట్లు వసూలు చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. ప్రభుత్వం ఓటీఎస్ అంగీకరించడంతో ఆశించిన స్థాయిలో పన్నులు వసూలవుతాయని భావిస్తోంది.

# నేడు నగరంలోని ట్రాఫిక్ ఆంక్షలు

**హైదరాబాద్, మార్చి 7,ప్రభాతవార్త:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం హైదరాబాద్ నగరంలో పలు చోట్ల ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ వెల్లడించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పరేడ్ గ్రౌండ్స్‌లో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం జరగనుంది. ఈ నేపథ్యంలో పరేడ్ గ్రౌండ్ వైపు ఉన్న దారుల్లో ఆంక్షలు విధిస్తున్నామని, మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు.

**ట్రాఫిక్ ఆంక్షలు ఇలా..**

టివోలి క్రాస్ రోడ్స్ నుంచి ప్లాజా క్రాస్ రోడ్స్ వరకు రోడ్డు మూసివేయనున్నారు. ఇక పంజాగుట్ట - గ్రీన్‌ల్యాండ్స్ - బేగంపేట - సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ మార్గంలో వెళ్లాలనుకునే ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలన్నారు. ఆలుగడ్డ బావి, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి వచ్చే ట్రాఫిక్‌ను సంగీత్ క్రాస్ రోడ్ వైపు, క్లాక్ టవర్, ప్యాట్నీ, పారడైజ్ మీదుగా మళ్లిస్తామని తెలిపారు. తుకారాంగేట్ నుంచి వచ్చే ట్రాఫిక్‌ను సెయింట్ జాన్స్ రోటరీ వైపు.. సంగీత్, క్లాక్ టవర్, ప్యాట్నీ, పారడైజ్ మీదుగా మళ్లిస్తామన్నారు. సంగీత్ క్రాస్ రోడ్స్ నుంచి బేగంపేట్ వైపు వచ్చే ట్రాఫిక్‌ను వైఎంసీఏ నుంచి క్లాక్ టవర్ వైపు ప్యాట్నీ, పారడైజ్, సిటిఓ, రసూల్‌పుర నుంచి బేగంపేట వైపునకు మళ్లించనున్నారు. బేగంపేట నుంచి సంగీత్ క్రాస్ రోడ్స్ వైపు వచ్చే ట్రాఫిక్‌ను బలామ్‌రాయి, బ్రూక్ బాండ్, టివోలి, స్వీకార్ ఉప్‌కార్, వైఎంసిఎ, సెయింట్ జాన్స్ రోటరీ నుంచి సంగీత్‌వైపు మళ్లిస్తారు. బోయిన్‌పల్లి, తాడ్‌బంద్ నుంచి టివోలి వైపునకు బ్రూక్ బాండ్ మీదుగా సిటిఓ, రాణిగంజ్, టాంక్‌బండ్ మీదుగా మళ్లిస్తారు. కార్ఖానా, జేబీఎస్ నుంచి ఎస్‌బిహెచ్ ప్యాట్నీ వైపు వెళ్లే వాహనాలను స్వీకార్ ఉప్‌కార్ వద్ద వైఎంసిఏ, క్లాక్‌టవర్, ప్యాట్నీ మీదుగా టివోలి వైపు మళ్లిస్తారు. ప్యాట్నీ నుంచి వచ్చే వాహనాలను స్వీకార్ ఉప్‌కార్, ఎస్‌బిహెచ్ వైపుకు రానివ్వకుండా, క్లాక్‌టవర్, వైఎంసిఏ, సిటిఓ వైపు మళ్లిస్తారని తెలిపారు.



మహిళా దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క



## మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యం

### -బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద

**నిజాంపేట్, మార్చి 7, ప్రభాతవార్త**

నిజాంపేట్ లోని సప్తపది గార్డెన్స్‌లో శుక్రవారం ఆదర్శ ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదర్శ ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 10వ వార్షికోత్సవ, అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, ఇంట్లో ఒక పురుషుడు చదువుకుంటే ఆ ఇళ్లు మాత్రమే అభివృద్ధి చెందుతుందని, అదే ఒక మహిళ చదువు ఆ కుటుంబంతో పాటు సమాజాభివృద్ధికి దోహదపడుతుందని, మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించినపుడే దేశాభివృద్ధి వేగవంతంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగారాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు ప్రణయ ధన్‌రాజ్ యాదవ్, గాజుల సుజాత, విజయలక్ష్మీ, నాయకులు సాంబశివా రెడ్డి, ఆదర్శ ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు చలసాని భారతి, శ్రీలత, పద్మ, సుజాత, నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

### మౌలిక వసతుల కల్పనతోనే నియోజకవర్గం సమగ్రాభివృద్ధి

**జగద్గిరిగుట్ట, మార్చి 7, ప్రభాతవార్త**

మౌలిక వసతుల కల్పనతోనే నియోజకవర్గం సమగ్రాభివృద్ధి సాధిస్తామని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. శుక్రవారం 126 జగద్గిరిగుట్ట డివిజన్ షిరిడి హిల్స్ ఏ కాలనీలో 20 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులకు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనతోనే సమాగ్రాభివృద్ధి సాధ్యమని, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, జగద్గిరిగుట్ట శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి మారయ్య, సీనియర్ నాయకులు బాబు గౌడ్, పాపిరెడ్డి, మల్లేష్ గౌడ్, జైహింద్, మజ్జి శ్రీనివాస్, విఠల్ ముదిరాజ్, ముంతాజ్, అజం, నాని, నాగరాజు గౌడ్, మహేందర్, జయకృష్ణ, షిర్డి హిల్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు శశిధర్ ముదిరాజ్, కాలనీ వాసులు బాబు గౌడ్, విఠల్ రెడ్డి, సత్యనారాయణ, నరసింహారెడ్డి,యాదిరెడ్డి,నరసింహులు పాల్గొన్నారు.

### కార్పొరేషన్ పరిశుభ్రతకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం



బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ క్లీనింగ్ పనులు పరిశీలిస్తున్న కమీషనర్ శరత్‌చంద్ర.

**నార్సింగి, మార్చి 7 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్‌లో పరిశుభ్రతకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని కమీషనర్ శరత్‌చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం కార్పొరేషన్ పరిధిలోని 17.వ,డివిజన్ వ్యాలీ వ్యూ ఎన్‌క్లేవ్ రహదారిలో స్వీపింగ్ పనులు, 2.వ,డివిజన్ గంధంగూడలో భూగర్భ డ్రైనేజి క్లీనింగ్ పనులను కమీషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా శరత్‌చంద్ర మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో పరిశుభ్రతపై ప్రతీ రోజు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, ఉదయం ఐదు గంటల నుంచి ఒంటి గంట వరకు శానిటరీ కార్మికులు రోడ్లన్నింటిని శుభ్రం చేస్తున్నారన్నారు. అలాగే అక్కడక్కడ భూగర్భ డ్రైనేజికి మరమ్మత్తులు చేస్తూ డ్రైనేజి పొంగకుండా చూస్తున్నామన్నారు. వేసవిలో నీటి ఇబ్బందులు రాకుండా జల మండలి అధికారులతో నిత్యం మాట్లాడుతూ నీటిని సరఫరా చేయిస్తున్నామన్నారు. దోమల బెడద తీవ్రరూపం దాల్చిందని, దోమల నిర్మూలన కోసం నిత్యం అన్ని డివిజన్లలో ఫాగింగ్ చేస్తున్నామని వివరించారు. కార్పొరేషన్ పరిధిలో ఎక్కడ ఏ సమస్య వచ్చినా వెంటనే ప్రజలు కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని, వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని కమీషనర్ శరత్‌చంద్ర తెలిపారు.

### నీటి సరఫరాను పెంచాలని జలమండలి జిఎంకు వినతి



నీటి సరఫరాను పెంచాలని జల మండలి జీఏంకు వినతిపత్రం ఇస్తున్న మాజీ కార్పోరేటర్ సాగర్‌గౌడ్.

**నార్సింగి, మార్చి 7 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలోని 20.వ,డివిజన్ పరిధిలో నీటి సరఫరాను పెంచాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ బి.సాగర్‌గౌడ్ శుక్రవారం జల మండలి జిఎం,డిజెంలకు వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా సాగర్‌గౌడ్ మాట్లాడుతూ వేసవి ప్రారంభంలోనే నీటి సరఫరా సవ్యంగా జరుగకపోవడంతో ప్రజలు అల్లాడుతున్నారని వాపోయారు. ఇళ్లలోని బోర్లు ఎండిపోయాయని, ఎండ తాపం వలన నీటి వాడకం పెరిగిపోయిందని, జల మండలి నుంచి రావాల్సిన నీరు పది రోజులకు ఒకమారు వస్తుండడంతో ప్రజలు తాగేందుకు, వాడుకునేందుకు అవసరమైన నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జల మండలి అధికారులు సవ్యంగా నీటిని అందిస్తే ప్రజలు బిల్లులు చెల్లించేందుకు సిద్దంగా ఉన్నారని, నీటి సరఫరాలో జాప్యం చేస్తుండడం వలన ప్రజలు వాటర్ ట్యాంకర్లను కొనాల్సి వస్తుందన్నారు. జల మండలి జిఎం, డిజిఎంలు ఉన్నతాధికారుల దృష్టికి మా సమస్యను తీసు కెళ్లి నీటి క్వాంటిటిని పెంచి, రెండు రోజులకు ఒకమారైనా సరఫరా చేసి ప్రజల ఇబ్బందిని దూరం చేయాలని సాగర్‌గౌడ్ కోరారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

**చిక్కడపల్లి, మార్చి 7 ప్రభాతవార్త:**

జిహెచ్‌ఎంసి పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో అన్నివర్గాలవారు సంపూర్ణ సహకారాన్ని అందించాలని జిహెచ్‌ఎంసి సర్కిల్-15 డిప్యూటీ కమీషనర్ పి.రామా నుజులరెడ్డి కోరారు. శుక్రవారం అడిక్‌మెట్ డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నేత కొండపల్లి మాధవ్ నేతృత్వంలో నేతలు శ్యామ్ సుందర్ చిట్టి, ఎర్రం శ్రీనివాస్‌గుప్త మర్యాదపూర్వకంగా కలిశా రు. ఎప్పటికప్పుడు సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వాటి ని త్వరితగతిన పరిష్కరించడానికి తమవంతు కృషి చేస్తామన్నారు.

## తెలంగాణకు అన్యాయం చేసి ఆంధ్రాకు కృష్ణమాదిగ పారిపోయారు : పిడమర్తి రవి



సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పిడమర్తి రవి

**సైఫాబాద్, మార్చి 7 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు ఎంత శాతం రిజర్వేషన్‌లు ఇవ్వాలో చెప్పకుండా ఎబిసిడి వర్గీకరణ జరగాలని మాదిగలకు అన్యాయం చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పారిపోయారని రాష్ట్ర ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ డా.పిడమర్తి రవి ఆరోపించారు. వర్గీకరణ బిల్లుకు రాష్ట్ర మంత్రి వర్గం అమోదం తెలిపినందుకు హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం బషీర్‌బాగ్‌లోని డా.బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఆయన పాలాభిషేకం చేసి, రాష్ట్ర మంత్రి వర్గంకు ధన్యవాదాలు తెలుపుతూ మాట్లాడారు. రాష్ట్రంలో మాదిగలకు 9 శాతం రిజర్వేషన్‌లు కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కృష్ణమాదిగ ఎపిలో మాదిగలకు ఎంత శాతం రిజర్వేషన్‌లు కావాలి అనేదానిపైన స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కృష్ణ మాదిగ మౌనం వల్ల మాదిగ జాతి ఒక శాతం రిజర్వేషన్‌లు నష్టపోయిందని మాదిగల పక్షపాతి అయిన రేవంత్‌రెడ్డి అని స్పష్టం చేశారు. మాదిగల చిరకాల స్వప్నమైన ఎస్సీ వర్గీకరణ బిల్లుకు రాష్ట్ర మంత్రి వర్గం అమోదం తెలపడం పట్ల ఆయన ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఎఐసిసి నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున్ ఖర్గేకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు చెప్పారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయ కుడు వరప్రసాద్, ఎంఆర్‌పిఎస్ నాయకులు మీసాల మల్లేశం, నర్సింహులు,స్టాలిన్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి : డాక్టర్ ఆలపాటి



మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా పారిశ్రామిక వేత్తమేచినేని సుభాషిణిని సత్కరిస్తున్న ట్యాగ్‌లైన్ కింగ్ డాక్టర్ ఆలపాటి తదితరులు

**శేరిలింగంపల్లి, మార్చి 7 ప్రభాతవార్త**

మహిళలు అన్ని రంగాలలో ముందుకు సాగినప్పుడే సమాజం ప్రగతి పథంలో నడుస్తుందని ప్రపంచ ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్, ట్యాగ్‌లైన్ కింగ్ డాక్టర్ ఆలపాటి అన్నారు. శేరిలింగంపల్లి రచయితల సంఘం, తెలుగు వెలుగు సాహిత్యవేదిక, ఎస్‌వీ ఫౌండేషన్ సంయుక్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా పారిశ్రామిక వేత్తగా ఎదిగిన ఉత్తమ ఉపాధ్యాయురాలు మేచినేని సుభాషిణికి చందానగర్ హుడాకాలనీలో ఆదర్శమహిళ అవార్డును ప్రదానం చేశారు. శేరిలింగంపల్లి రచయితల సంఘం అధ్యక్షులు డాక్టర్ మోటూరి నారాయణరావు అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సత్కార సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ప్రపంచ ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ ఆలపాటి మాట్లాడుతూ.. మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా పయనించాలని, అందుకు ఆత్మస్థైర్యమే ఆయుధం కావాలని ఆయన అన్నారు. జీవితంలో పెను సవాళ్లను ఎదుర్కొంటూ విజయం సాధించిన వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్, సినీనేపథ్య గాయకుడు రవివర్మ మాట్లాడుతూ.. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడం అంత సులువైన పనికాదని, అందుకు ఆత్మవిశ్వాసం, ధైర్యం,అంకితభావం అవసరమన్నారు. అన్నీ ఉన్నా జీవితంలో ఏమీ సాధించలేని మహిళలు ఎందరో ఉన్నారని వారందరికీ భిన్నంగా సుభాషిణి ఏడు పదుల ఏళ్లు నిండినా ఎందరికో ఉపాధి కల్పించటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా, ఉపాధ్యాయురాలు, ప్రముఖ పారిశ్రామిక వేత్త మేచినేని సుభాషిణికి శేరిలింగంపల్లి రచయితల సంఘం, తెలుగు వెలుగు సాహిత్య వేదిక, ఎస్‌వీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదర్శమహిళ అవార్డును ట్యాగ్‌లైన్‌కింగ్ డాక్టర్ ఆలపాటి, ప్రముఖ నేపథ్యగాయకుడు, మ్యూజిక్ డైరెక్టర్ రవివర్మ చేతుల మీదుగా ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సుప్రసిద్ధ కవులు వసీరా,పత్తిపాక సురేందర్, శేరిలింగంపల్లి రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవీంద్రబాబు అరవా, కార్యవర్గ సభ్యురాలు సుమచంద్ర, వనజప్రియ, కుటుంబ సభ్యులు వేణు, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

## ఎంజిఐటిలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు





ఎంజిఐటి కళాశాలలో జరిగిన అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి తదితరుల దృశ్యం

**నార్సింగి, మార్చి 7 ప్రభాతవార్త :** గండిపేటలోని ఎంజిఐటి కళాశాలలో శుక్రవారం "అంతర్జాతీయ మహిళా దినోత్సవ " వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఆర్‌బిఐ రిటైర్డ్ జెనరల్ మేనేజర్ యశోదా భాయి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ... మహిళలు స్వశక్తిపై నిలబడేందుకు, ఆర్థిక స్వాతంత్ర్యంను కలిగి ఉండేందుకు కృషి చేయాలన్నారు. అటెండర్ నుంచి అంతరిక్షం దాకా మగవారికి ఏమాత్రం తీసి పోకుండా మగువలు రాణిస్తుండడం గర్వంగా ఉందన్నారు. తల్లిదండ్రులు కొడుకుతో సమానంగా కూతుళ్లను చదివించాలని, వారికి ఇష్టమైన రంగాల్లో రాణించేందుకు ప్రోత్సహించాలని సూచించారు.అనంతరం గౌరవ అతిథి కవితారెడ్డి మాట్లాడుతూ కుటుంబ క్షేమం కోసం మహిళలు ప్రతిరోజూ ఎంతో శ్రమిస్తుంటారని, తమ ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. బోర్డు సభ్యురాలు డాక్టర్ సి.జయశ్రీరెడ్డి మాట్లాడుతూ దేశ నిర్మాణం, మహిళా సాధికారికతలో అహల్యాభాయి హోల్కర్ చేసిన కృషి అమోఘమన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ జి.చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో విశేషంగా రాణిస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ఇచ్చి అభినందించారు. ఈ వేడుకలు ఎంజిఐటి కళాశాల విమెన్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, డబ్ల్యుడిసి చైర్ పర్సన్ జి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలీలు హక్కులను గురించి పాలకుల వద్ద ప్రస్తావించాలి



అఖిలభారత పద్మశాలి సంఘం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కాదేవదాస్

**చిక్కడపల్లి, మార్చి 7 ప్రభాతవార్త:** దేశంలో, రాష్ట్రంలో పద్మశాలీలు చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి పద్మ శాలీల ఉజ్వల భవిష్యత్తుకై ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఐక్యంగా ఉంటూ ముందుకు సాగాలని చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు, మాజీ అఖిలభారత పద్మశాలి సంఘం సాంస్కృతిక విభాగం కార్యదర్శి డాక్టర్ చిక్కా దేవదాసు అన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 9న నిర్వహించే అఖిల భారత పద్మశాలి సంఘం మహాసభల ద్వారా సమస్యల పరిష్కారం సాధించవచ్చన్నారు. శుక్రవారం మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను పద్మశాలి సంఘం నేతలతో కలిసి ఆవిష్కరించి ప్రసంగించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో 9న జరిగే అఖిలభారత పద్మశాలి సంఘం మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు, మాజీ అఖిలభారత పద్మశాలి సంఘం సాంస్కృతిక విభాగం కార్యదర్శి డాక్టర్ చిక్కా దేవదాసు మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. రాష్ట్రంలో పద్మ శాలీలు 12 శాతం ఉన్నారని, రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా మన వాటా మన హక్కుల కోసం మేమెంతో మాకు అంతా అన్న నినాదంతో పాలకుల దృష్టికి తీసుకుపోయి వాటి పరిష్కారానికి పద్మశాలీల ఉజ్వల భవిష్యత్తుకు ఈ మహాసభలు దోహదపడతాయని అన్నారు. దేశ రాష్ట్ర నలుమూలల నుండి పద్మశాలీలు చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని మహ సభను విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ బాలరాజ్,టి చంద్రశేఖర్, కే సుదర్శన్ రావు, శ్రీకాంత్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవం



ప్రసంగిస్తున్న నక్కా శ్రీనివాస్, చిత్రంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రభు తదితరులున్నారు

**చిక్కడపల్లి, మార్చి 7 ప్రభాతవార్త:** విద్యానగర్ లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో "సావిత్రిబాయి పూలే మహిళా సాధికారత విభాగం" ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.ప్రభు అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నక్కా వెంకటమ్మ యాదగిరి స్వామి ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ నక్కా శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.ప్రభు మాట్లాడుతూ భారతీయ సమాజం కుటుంబ వ్యవస్థతో కూడుకొని మహిళకు ఉన్నతమైనటువంటి గౌరవాన్ని ఇచ్చిందని, పితృస్వామ్య వ్యవస్థ వలన చరిత్రలో మహిళలు అసమానతలను ఎదుర్కొన్నారని అన్నారు. స్వాతంత్రం తరువాత రాజ్యాంగం ఇచ్చిన హక్కుల వలన మరియు సమాజంలో వచ్చిన ఆధునిక భావజాలాల మార్పు వలన మహిళలు అన్ని రంగాల్లో సమాన అవకాశాలను అందిపుచ్చుకున్నారన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా కళాశాలలోని మహిళా అధ్యాపకులకు నిర్వహించిన సాంస్కృతిక పోటీలలో గెలుపొందిన వారికి మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ సంస్థ వారు గిఫ్టులను అందించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వెంకట్ ఈశ్వర్, మహిళా సాధికారత విభాగం కోఆర్డినేటర్ ఎస్. రమాదేవి, డా.పద్మజ, డా. అనురాధ, డా. అనసూర్య, డా. ముక్తవాణి, డా. ఆర్. రమాదేవి, షేబారాణి, .కె.నీరజ, జె.అనితారాణి, డా. విరాల సంతోషి, డా.ఎల్ .విజయ, డా. వి.కళ్యాణి, రాజశ్రీ, మరియు ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి : సివి ఆనంద్



షహీద్ భగత్ సింగ్ స్మరక యువజన ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

**చిక్కడపల్లి మార్చి 7 ప్రభాతవార్త:**

యువత, విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉంగాలని నగర పోలీసు కమిషనర్ సివి.ఆనంద్ పిలుపునిచ్చారు. శుక్రవారం భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డి.వై.ఎఫ్.ఐ ).భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్.ఎఫ్.ఐ ) సంఘాల ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్న షహీద్ భగత్ సింగ్ స్మరక యువజన ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ సీవీ ఆనంద్ ఆవిష్కరించి ప్రసంగించారు. డ్రగ్స్,గంజాయి నిర్మూలన కోసం కృషి చేయడం ప్రతి ఒక్క పౌరుడి బాధ్యత అన్నారు. నేటి యువత లో కొద్దిమంది చెడు వ్యసనాలకు అలవాటుపడి వారి జీవితలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. దేశంకోసం ప్రాణర్పణ చేసిన భగత్సింగ్ స్ఫూర్తి తో యువజన ఉత్సవాలను నిర్వహించడం, ఎస్.ఎఫ్.ఐ,డి.వై.ఎఫ్.ఐ సంఘాలు "సే నో టూ డ్రగ్స్" నినాదంతో క్యాంపెయిన్ నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. ఈ కాంపెయిన్ ద్వారా విస్తృతంగా విద్యార్థులను, యువత ను చైతన్యవంతం చేయాలనీ సూచించారు. భగత్‌సింగ్ స్మారక యువజనోత్సవ కమిటీ ఆహ్వాన సంఘం అధ్యక్షులు జె.కె శ్రీనివాస్,ఎస్.ఎఫ్.ఐ, డి.వై.ఎఫ్.ఐ నగర కార్యదర్శిలు అశోక్ రెడ్డి, జావీద్, ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షులు అజయ్ బాబు, మహేందర్, ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షులు లెనిన్ జిల్లా నాయకులు స్టాలిన్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు సాధించిన ఘనత ప్రపంచానికి తెలియచేయటానికే మహిళా దినోత్సవం

### -ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం



ఎమ్మెల్సీ కోదండరాంను సత్కరిస్తున్న టీజీవో మహిళా నేతలు

**ముషీరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** మహిళలు సాధించిన ఘనత ప్రపంచానికి తెలియచేయటమే అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యమని తెలంగాణ జేఏసీ ఛైర్మన్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. శుక్రవారం దోమలగూడలోని గవర్నమెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజిలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమంకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ మహిళా సాధికారతకై 1975 నుండి ప్రపంచ స్థాయిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్నామని తెలిపారు. మహిళా దినోత్సవం జరుపుకోవటం వల్ల మహిళల్లో ఆత్మస్థైర్యం పెరిగిందని, సావిత్రిబాయ్ పూలే వంటి గొప్ప మహిళల ప్రోత్సాహంతో మహిళలు నేడు విద్యతో పాటు అన్ని రంగాలలో పురుషులతో పాటు సమానంగా రాణిస్తున్నారని కొనియాడారు. ఈ వేడుకలలో భాగంగా మహిళలు వివిధ ఆటలు, పాటలు, నృత్యాలతో సందడి చేశారు. ప్రతిభ కనబరిచిన మహిళలకు ఆయన చేతుల మీదగా బహుమతులు అందచేశారు. అనంతరం అసోసియేషన్ మహిళా నేతలు కోదండరాంను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ఏ.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఏ.సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు దీపారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ సంబంధానికి అడ్డువస్తున్నారని తల్లికూతుళ్ల హత్య

**తార్నాక, నేరేడ్మెట్,మార్చి 7 ప్రభాతవార్త :**

తాను పెట్టుకున్న అక్రమ సంబంధం అక్కా, తల్లి హత్యలకు దారితీసింది. లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకరు, జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరొకరు హత్యకు గురయ్యారు. అక్రమ సంబంధానికి అడ్డుగా ఉంటున్నారని ప్రియుడితో కలిసి సొంత అక్కను హతమార్చింది. గుట్టుచప్పుడు కాకుండా ప్రియుడితో కలిసి అక్కను చంపి మృతదేహాన్ని మూటకట్టి పక్కనే ఉన్నటువంటి సిమెంట్ కుండీలో పడేసి దానిపై చెత్తాచెదారం వేసి దాచి పెట్టారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్స్పెక్టర్ రఘు బాబు తెలిపిన వివరాల ప్రకారం.. నార్త్ లాలాగూడ ప్రాంతానికి చెందిన సుశీలకు నలుగురు సంతానం. జ్ఞానేశ్వరి (45) లక్ష్మీ (40) ఉమా మహేశ్వరి (35) ముగ్గురు కూతుళ్లు శివ (37) అనే ఒక కుమారుడు. వీరిలో ఎవ్వరికీ వివాహం జరగలేదు. పెద్ద కుమార్తె జ్ఞానేశ్వరికి మానసికస్థితి బాగాలేదు. చిన్న కూతురు ఉమామహేశ్వరి లాల్ బజార్ లో కాల్ సెంటర్ లో పనిచేస్తుంది. కుమారుడు శివ యూఎస్ఏ లో ఉద్యోగం చేస్తున్నాడు. కొన్నేళ్ల క్రితం సుశీల భర్త అనారోగ్యంతో మృతి చెందడంతో అతని రైల్వే ఉద్యోగం రెండో కూతురు లక్ష్మీ వచ్చింది. 2018 వ సంవత్సరం వరకు వీరందరూ లాలాగూడలోని రైల్వే క్వార్టర్స్ లోనే ఉండేవారు. ఆ తరువాత జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కౌకూర్ లో ఇల్లు కట్టుకొని అక్కడికి షిఫ్ట్ అయ్యారు. అయితే, లక్ష్మీ లాలాగూడ వర్క్ షాప్ లో ఉద్యోగం చేస్తుండడంతో తన అక్క జ్ఞానేశ్వరి ఇక్కడే చెల్లితో రైల్వే క్వార్టర్స్ లో ఉంటుంది. ఈ క్రమంలో జవహర్ నగర్ ప్రాంతానికి చెందిన అరవింద్ (45) అనే వ్యక్తితో వీరి కుటుంబానికి 2010వ సంవత్సరం నుంచి పరిచయం ఉండేది.. ఈ క్రమంలో లక్ష్మీకి అరవింద్ కు అక్రమ సంబంధం ఏర్పడింది. నిత్యం వీరిద్దరు కలిసి తిరుగుతుండడం లక్ష్మీ కుటుంబ సభ్యులకు నచ్చేది కాదు. ఈ విషయంలో అనేక మార్లు గొడవలు జరిగేవి. ఇదిలా ఉండగా ఈ నెల 6న సాయంత్రం 7 గంటల సమయంలో అరవింద్ జవహర్ నగర్లోని లక్ష్మీ తల్లి ఇంటికి వెళ్లి ఆమెతో గొడవ పెట్టుకున్నాడు. ఈ క్రమంలో తల్లి సుశీల తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందడంతో అక్కడి నుంచి పరారైయ్యాడు. కూతురు ఉమా మహేశ్వరి ఇంటికొచ్చే సరికి తల్లి చనిపోయి ఉండడంతో ఒక్కసారిగా కంగుతింది. వెంటనే సీసీ కెమెరాలు పరిశీలించగా అరవింద్ గోడ దూకి పారిపోతున్నట్లు తెలుసుకొని స్థానిక పోలీసే స్టేషన్లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు శుక్రవారం విచారణ నిమిత్తం అరవింద్ అక్రమ సంబంధం పెట్టుకున్నటువంటి లాలాగూడ రైల్వే క్వార్టర్స్ లో ఉంటున్న ఉమామహేశ్వరి అక్క లక్ష్మీ ఇంటికి వచ్చారు. ఈ క్రమంలోనే జ్ఞానేశ్వరిని రెండ్రోజుల క్రితం తాము చంపి సంపులో మూటకట్టి పడేసినట్లు లక్ష్మీ వెల్లడించింది. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానిక లాలాగూడ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని సంపులో ఉన్న మృతదేహాన్ని వెలికితీయగా సదరు మృతదేహం పూర్తిగా డీకంపోజ్ స్టేజ్ లో ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. అయితే, లక్ష్మీ అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆమెను వెంటబెట్టుకొని మరో నేరస్థుడు అరవింద్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నింధితులు ఇద్దరిని అదుపులోకి తీసుకొని పూర్తి విచారణ చేసిన అనంతరం హత్యకు గల అసలైన కారణాలు, ఎలా చంపారు. ఎక్కడ చంపారు అనే మరికొన్ని విషయాలు స్పష్టంగా తెలుసుకొని వెల్లడిస్తామని పోలీసులు చెప్పారు.

## గంగ పుత్ర సంఘం సమస్యల పరిష్కారానికి కృషి : రాజేష్ కుమార్



కార్యక్రమంలో పాల్గొన్న బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ పులిపాటి రాజేష్ కుమార్,గంగ పుత్ర సంఘం ప్రతినిధులు

**చార్మినార్,మార్చి 7 ప్రభాతవార్త :**

బహదూర్‌పుర నియోజకవర్గం దూద్‌బౌలిలో శుక్రవారం అలియాబాద్ గంగ పుత్ర సంఘం ప్రతినిధులు బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్‌ను కలిశారు.అలియాబాద్ పరిసర ప్రాంతాలలో గంగ పుత్ర జనాభా ఎక్కువ ఉన్నచోట స్థానిక సమస్యలను సంఘం ప్రతినిధులు రాజేష్ కుమార్‌కు వివరించారు.ఈ సందర్భంగా బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్ మాట్లాడుతూ అలియాబాద్ గంగ పుత్ర సంఘం సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లటంతో పాటు సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించటానికి తన శాయ శక్తుల కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో అలియాబాద్ గంగపుత్ర సంఘం అధ్యక్షులు దార్బాలి కృష్ణ,ప్రధాన కార్యదర్శి పల్లెల పురుషోత్తం,ఉపాధ్యక్షులు ఆనందేశి ప్రవీణ్,ముఖ్య సలహాదారులు ఆనందేశి అర్జున్ కుమార్,ఎగ్జిక్యూటివ్ ప్రెశిడెంట్ గుంటి బసంతరావు,అదనపు ప్రధాన కార్యదర్శి ఏ.వి.జ్ఞానే శ్వర్ పాల్గొన్నారు.

### ఎంఎల్ఆర్ఐటీఎంలో అంతర్జాతీయ సదస్సు

**దుండిగల్, మార్చి 7, ప్రభాతవార్త**

మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అప్లికేషన్స్ ఆఫ్ ఏఐ ఇన్ స్మార్ట్ టెక్నాలజీస్ అండ్ మ్యానుఫాక్చరింగ్ (ఏఐఎస్‌టీఎం - 2025) అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ రెండు రోజుల సదస్సు మార్చి 7, 8 తేదీల్లో నిర్వహించబడుతోంది. ఇందులో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు, విద్యావేత్తలు, విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక సదస్సును ఎంఎల్ఆర్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి అధికారికంగా ప్రారంభించగా, డైరెక్టర్ డాక్టర్ పి. శ్రీధర్, ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. మురళి ప్రసాద్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ యు. సుధాకర్, కన్వీనర్ డాక్టర్ ఎస్.పి. జానీ, కోకన్వీనర్ డాక్టర్ కే. శ్రావంతి, ట్రెజరర్ డాక్టర్ రఘువులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సూర్య ప్రకాష్ సముదాయాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ముఖ్య అతిథిగా డాక్టర్ ఎన్. కిషోర్ నాథ్, సైంటిస్ట్ -జీ, వేద ప్రాజెక్ట్, డీఆర్‌డీఓ, హైదరాబాద్ పాల్గొని రక్షణ రంగంలో ఏఐ అన్వయాలు, ఆధునిక పరిశోధనల గురించి విశ్లేషించారు. ఏఐఎస్‌టీఎమ్ 2025 సదస్సు ద్వారా పరిశ్రమ అకడమిక్ భాగస్వామ్యాలను బలోపేతం చేయడం, పరిశోధనలో నూతన మార్గాలను అన్వేషించడం, కృత్రిమ మేధస్సు తో ఉత్పత్తి రంగాన్ని మెరుగుపరచడం ప్రధాన లక్ష్యాలు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన విద్యార్థులు, పరిశోధకులు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, స్పాన్సర్ సంస్థలు, మీడియా ప్రతినిధులు యాజమాన్యానికి ఎంఎల్ఆర్ఐటీఎం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

## బెల్ట్ షాపులపై దాడులు..

**పేట్ బషీరాబాద్, మార్చి 07, ప్రభాతవార్త**

పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ వారు విజిబుల్ పోలీసులతో కలిసి గత రెండు రోజుల నుండి పలు దాబాలు, బెల్ట్ షాపులపై దాడులు చేస్తున్నారు. దాడుల్లో భాగంగా బైసాకి దాబా, న్యూ ఫ్యామిలీ దాబా, దూలపల్లిలోని స్టీల్ సిటీలో బెల్ట్‌షాప్ లో అక్రమంగా మద్యం అమ్ముతుండగా పోలీసులు పట్టుకొని వారిపై కేసులు నమోదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

## ఈవీఎం గోడౌన్‌ను సందర్శించిన కలెక్టర్





**అత్తాపూర్ మార్చి7,ప్రభాతవార్త :**

రాజేందర్ నగర్‌లో గల ఈవీఎం గోడౌన్‌ను జిల్లాకలెక్టర్ సి. నారాయణ రెడ్డి సందర్శించారు. మూడు నెలల్లో కొసరి జరిగే సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా శుక్రవారం క్షేత్ర స్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్ కు వేసిన సీళ్లను పరిశీలించి, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి.ప్యాట్లు, ఇతర ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు.కలెక్టర్ వెంట రాజేందర్ నగర్ ఆర్డీఓ వెంకట్ రెడ్డి, తహసీల్దార్ రాములు,ఎన్నికల విభాగం అధికారులు, బిజెపి నాయకులు శ్రీధర్ వివిధ పార్టీ నాయకులు,తదితరులు ఉన్నారు.

## అన్ని రంగాలలో రాణిస్తున్న మహిళలు



మహిళా స్ఫూర్తి అవార్డులు అందుకున్న ప్రముఖ మహిళలు

**సైఫాబాద్, మార్చి 7 ప్రభాతవార్త:** మహిళలు మహరాణిగా ప్రస్తుతం అన్ని రంగాలలో రాణిస్తున్నారని రాష్ట్ర శాసన మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి చెప్పారు. మహిళలు అభివృద్ధి చెందినే దేశం, రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కోటపాటి ఫౌండేషన్, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రవీంద్రభారతిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'మహిళా స్ఫూర్తి అవార్డు'ల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. బిజెపి రాష్ట్ర జనరల్ సెక్రటరీ కొల్లి మాధవి మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో స్త్రీల పాత్ర పెరుగుతూ వచ్చి వివిధ వేదికలు మహిళా దినోత్సవాలకు స్థానం కల్పించాయని చెప్పారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం జరిగింది. అనంతరం మహిళా స్ఫూర్తి అవార్డు గ్రహీతలు డాక్టర్ సృజన, మంతెన శాంతి కుమారి, డా.అలూరి విజయలక్ష్మి, కేతా శ్రీదివ్యరెడ్డి, అరుణజ్యోతి, బి.రమాదేవి, కోకిల సుజాత, ఉప్పు అంబిక, మమతలన ఆయన ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి డా.బూర్తుల మధుసూదనరావు, సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ, వికెవి ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఓరుగంటి కృష్ణవేణి, నల్లతీగ శ్రీనివాసాచార్యులు, డా.రాధా కుసుమ, నిర్వాహకులు కె.మురళీమోహన్, రాజు, కోటపాటి మురళి, కేతా సుధాకర్‌రెడ్డి, డా.ఎస్.రామచంద్రరావు, సభ్యులు జొన్నలగడ్డ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### చిన్నారుల మానసిక శారీరక దారుఢ్యానికి పాఠశాలలు తోడ్పడాలి

**కుత్బుల్లాపూర్, మార్చి 7 ప్రభాతవార్త**

చిన్నారులు శారీరక ,మానసిక ఎదుగుదలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమని కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మానగర్ ఫేజ్-2రింగ్‌రోడ్డువద్ద లిటిల్ కిడ్స్ కేర్‌సెంటర్‌నూ ఆయన స్థానిక మాజీ కార్పొరేటర్ కె.ఎం.గౌరీష్, టిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి సత్తిరెడ్డిలతో కలిసి ప్రారంభించారు.ఈసందర్భంగా లిటిల్ కిడ్స్ కేర్ డాక్టర్. శ్రావణితో కలిసి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ వివేకానంద్ మాట్లాడుతూ చిన్నారులను పెంచడం సులభతరం కాదన్నారు. ఎంతో అనుభవం, ఓపిక తో లిటిల్ కిడ్స్ కేర్‌సెంటర్లను నడపాల్సిన అవసరం ఎంతైనావుందన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఇందు కూరి సూర్యప్రభ, నాయకులు సుధాకర్ గౌడ్, సురేందర్‌రెడ్డి, రమణారెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పోచమ్మ దేవాలయంలో 8 నుండి ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం

**వనస్థలిపురం మార్చి7,ప్రభాతవార్త :** వనస్థలిపురం డివిజన్ లోని హుడా కాలనీ ఫేస్ 2.లో గల శ్రీ పోచమ్మ తల్లి దేవాలయంలో ఈనెల 8 శనివారం నుండి 10 సోమవారం వరకు ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమాలు వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ధ్వజస్తంభం దాతలు భవానీ రాజశేఖర్ విజయ,భవాని ప్రమోద్ కుమార్ అనిత దంపతులు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం గణపతి పూజ,పుణ్యాహవచనం,ఆదివారం యగశాలలో ఆరాధన చండీ హోమం,ధ్వజస్తంభ ఆరాధన, మంగళహారతి, మంత్రపుష్పం,తీర్థప్రసాద వితరణ,సోమవారం పుష్యమి నక్షత్రయుక్త మీనలగ్నం నందు ఉదయం 7.05 నిమిషములకు ధ్వజస్తంభ ప్రతిష్టాపన,కుంభప్రోక్షణ, అలంకరణ, ఆశీర్వచనం,అన్న ప్రసాదవితరణ తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించబడతాయని,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులుకాగలరని వారు కోరారు. కార్యక్రమంలో మూడు రోజులు హోమాలు,కుంకుమ పూజలు జరుగుతాయన్నారు.

## పార్క్ అభివృద్ధికి రూ.21లక్షలు మంజూరు : లచ్చిరెడ్డి



**వనస్థలిపురం మార్చి7,ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ పురం కాలనీ ఫేస్ 2 పార్కులో 21 లక్షల రూపాయల నిధులతో అభివృద్ధి చేయనున్న చిల్డ్రన్స్ ప్లే ఎక్విప్మెంట్స్ మరియు ఓపెన్ జిమ్ స్థలాన్ని కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పార్కులో ఓపెన్ జిమ్ మరియు చిల్డ్రన్స్ ప్లే ఎక్విప్మెంట్ కొరకు 21లక్షల రూపాయలు మంజూరు చేయించడంలో కృషిచేసి సహకరించిన కార్పొరేటర్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.మరియు అలాగే కాలనీ పార్కులో వీధి దీపాలు మరియు కాలనీలో రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ త్వరలోనే దశలవారీగా కాలనీలోని ప్రతి అభివృద్ధి మరియు సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం ఏఈ రాజ్ కుమార్,శ్రీపురం కాలనీ ఫేస్ 2 అధ్యక్షులు కాల్వ శ్రీధర్ రెడ్డి, సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్ ఫేస్ 2 గుమ్మడి మహేందర్ రెడ్డి, చిగురింత సికిందర్ రెడ్డి, పాశం విట్టల్ రెడ్డి,కల్లు విష్ణువర్ధన్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, జంగయ్య గౌడ్, కండె రాజేందర్, రాజేందర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, బాకారం నరసింహారెడ్డి, బృంగి శిరీష్ కుమార్, వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,నారాయణరెడ్డి, అరవింద్ రెడ్డి,గోలి ప్రభాకర్ రెడ్డి, వెంకటేశ్వరరావు మరియు నాయకులు పవన్ కుమార్, కిషోర్ కుమార్, సురేష్ కుమార్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా రాణించినపుడే దేశాభివృద్ధి




మహిళా దినోత్సవ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ లక్ష్మి ప్రసన్న రామ్మోహన్ గౌడ్.

**వనస్థలిపురం. మార్చి7,ప్రభాతవార్త:** మహిళలు అన్ని రంగాలలో రాణించినపుడే దేశం అభివృద్ధి చెందుతుందని బి.యన్.రెడ్డి. నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మి ప్రసన్న రామ్మోహన్ గౌడ్ పేర్కొన్నారు. బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్ లోని సాహెబ్ నగర్ కల్యాణ మండపంలో వైదేహినగర్ లిటిల్ ఫ్లవర్ స్కూల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతిప్రజ్వలన లతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు వంటింటికె పరిమితం కాకుండా ఆర్థికంగా రాజకీయంగా, సేవా కార్యక్రమాల్లో రాణించినపుడే సమాజంలో తగిన గుర్తింపు వస్తుందన్నారు.నేటి సమాజంలో మహిళలకు రక్షణ లేకుండా పోతుందని,ప్రభుత్వం మహిళలకు తగు రక్షణ కల్పించాలన్నారు. అనంతరం స్కూలు యాజమాన్యం లక్ష్మి ప్రసన్నను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ అండ్ కరెస్పాండెంట్ స్వదేశీ పాలోజు, ఇంచార్జి లు సునీత,సుజాత,పుష్ప ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మైనంపల్లి హనుమంత్ రావును కలిసిన లక్ష్మీ వెంకటేశ్వర ఆలయ కమిటీ సభ్యులు



**నేరేడ్ మెట్,మార్చి 7, ప్రభాతవార్త :** మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలోని ఆనంద్ బాగ్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర ఆలయ అభివృద్ధి కమిటీ శుక్రవారం మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్ రావు ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మైనంపల్లి హనుమంత్ రావు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిలో శక్తివంతన లేకుండా కృషిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై వేంకట రమణ చార్యులు, అభివృద్ధి కమిటీ చైర్మన్ సానాది శంకర్, కమిటీ సభ్యులు హేమంత్ కుమార్, పిట్టల గణేష్, సంజయ్, శ్రీకాంత్, సురేష్ సింగ్, ఏగొండ చారి, శోభన్, అనిత, శ్రీధర్, రత్నాకర్, వెంకటస్వామి, పద్మావతి, రవీందర్ రెడ్డి, శ్రీవారి సేవకులు సంజయ్ గుప్తా, నాగరాజు గౌడ్ పాల్గొన్నారు.

### కనుల పండువగా లార్డ్స్ శ్రీవిద్యా వికాస్ పాఠశాల వార్షికోత్సవం

**సరూర్‌నగర్, మార్చి 7 ప్రభాతవార్త:** బాలాపూర్ మండలంలో విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న లార్డ్స్ విద్యా సంస్థలకు చెందిన గుర్రంగూడ లార్డ్స్ శ్రీ విద్యా వికాస్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు కనుల పండువగా జరిగాయి. విద్యా సంస్థల ఛైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ ఛైర్మన్ బెర్ల శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ సిద్దాల శ్రీలతల నిర్వహణలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా స్థానిక గుర్రంగూడ మాజీ కార్పొరేటర్లు దడిగ శంకర్, గడ్డం లక్ష్మారెడ్డి, ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్టు డాక్టర్ తుమ్మ తేజస్వి ని, న్యూట్రిషియనిస్టు డాక్టర్ శుభోదినిలు విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ జ్ఞానానికి మించిన సంపద లేదనీ విద్యార్థుల్లో విజ్ఞాన జ్యోతులు వెలిగిస్తున్న లార్డ్స్ యాజమాన్యాన్ని ప్రశంసించారు. కాగా వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి, పౌరాణిక తదితర సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో లార్డ్స్ విద్యా సంస్థల డీన్ సతీష్‌కుమార్, గుర్రంగూడ బ్రాంచి ప్రిన్సిపాల్ శివాని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాఠ శాల సిబ్బందితో పాటు లార్డ్స్ బ్రాంచిలకు చెందిన ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మలక్‌పేట బిఆర్ఎస్ ఇంచార్జ్ అజిత్ రెడ్డి కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి



కనిష్క్ రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నగర మేయర్ గద్వాల విజయలక్ష్మీ మాజీ మంత్రి మహమ్మద్ అలీ తదితరులు

**మలక్ పేట, మార్చి 7, ప్రభాతవార్త :** మలక్ పేట నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జ్ తీగల అజిత్ రెడ్డి, మూసారాం బాగ్ డివిజన్ మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డి దంపతుల కుమారుడు కనిష్క్ రెడ్డి రోడ్డు ప్రమాదంలో (19) మృతి చెందారు. టెక్ మహీంద్రా కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతున్న కనిష్క్ రెడ్డి గురువారం రాత్రి జూబ్లీహిల్స్ లోని తన స్నేహితుని ఇంట్లో జరిగిన ఫంక్షన్ కు హాజరై తిరిగి తన బెంజ్ కారులో వస్తుండగా పెద్ద గోల్కొండ తుక్కుగూడ మధ్యన ఓఆర్ఆర్ ఎగ్జిట్ వద్ద ఆగి ఉన్న ట్రైలర్ (ట్రాలి లారీ) ని వెనుక వైపు నుంచి ఢీ కొట్టడంతో తలకు తీవ్ర రక్త గాయాలయ్యాయి. సమాచారాన్ని అందుకున్న శంషాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం అతన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న కనిష్క్ రెడ్డి తండ్రి తీగల అజిత్ రెడ్డి, తల్లి సునరితారెడ్డి, కుటుంబ సభ్యులు ఉస్మానియా ఆసుపత్రికి చేరుకొని మెరుగైన చికిత్స కోసం కనిష్క్ రెడ్డిని మలక్ పేట యశోద ఆసుపత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం కనిష్క్ రెడ్డి మృతి చెందారు. మూసరాంబాగ్ లో విషాద ఛాయలు మలక్ పేట్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జ్ తీగల అజిత్ రెడ్డి, ముసారాంబాగ్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సునారితా రెడ్డి దంపతుల కుమారుడు కనిష్క్ రెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారన్న వార్త మూసారంబాగ్ డివిజన్ లో దావానం లా వ్యాపించడంతో పలువురు నాయకులతో పాటు డివిజన్ ప్రజలు పెద్ద ఎత్తున సలీం నగర్ లోని వారింటికి తరలి వచ్చారు. ఎంతో సౌమ్యుడిగా అందరికీ సుపరిచితుడైన కనిష్క్ రెడ్డి మరణ వార్తను జీర్ణించుకోలేక పలువురు కంటతడి పెట్టారు. ఎదిగిన కొడుకు కళ్ళ ముందు విగత జీవిలా పడి ఉండడంతో జీర్ణించుకోలేని ఆ తల్లిదండ్రుల, కుటుంబ సభ్యుల రోధనలతో ఆ ప్రాంతంలో విషాద చాయలు అలుముకున్నాయి.

**కుటుంబ సభ్యులను పరామర్శించిన పలువురు ప్రముఖులు**

కనిష్క్ రెడ్డి కుటుంబ సభ్యులను పలువురు ప్రముఖులు పరామర్శించారు. మాజీ హోంమంత్రి మహమూద్ అలీ, బిఆర్ఎస్ గ్రేటర్ నాయకుడు ఆజం అలీ, మేయర్ విజయలక్ష్మీ, బడంగ్ పేట మాజీ మేయర్ చిగురింత పారిజాత నరసింహారెడ్డి, మలక్ పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవీరెడ్డి సుధీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చెకోలేకార్ శ్రీనివాస్, ముసరాంబాగ్ డివిజన్ కార్పొరేటర్లు బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి, అరుణ రవీందర్ రెడ్డి, రాంనగర్ మాజీ కార్పొరేటర్లు శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు సామ ప్రభాకర్ రెడ్డి, కొప్పుల విట్టల్ రెడ్డి, అనితా దయాకర్ రెడ్డి, సింగిరెడ్డి స్వర్ణలతా రెడ్డి, జిన్నారం విఠల్ రెడ్డి, ముసరాంబాగ్ డివిజన్ బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చెల్లూరి రఘునందన్ రెడ్డి, గిరిధర్, బొక్క గోవర్ధన్ రెడ్డి, కనుకుల రవీందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాధ, మాజీ వైస్ చైర్మన్ భుమే శ్వర్, మాజీ డైరెక్టర్లు నరేష్, శ్రీధర్ రావు తదితరులు హాజరై కనిష్క్ రెడ్డి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సలీంనగర్లోని స్వగృహంలో ప్రజల సందర్శనార్థం రెండు గంటల పాటు కనిష్కి రెడ్డి మృతదేహాన్ని ఉంచిన కుటుంబ సభ్యులు ఆ తర్వాత అంత్యక్రియలకు నాగోల్ ఫతుల్లా గుడాలోని మహా ప్రస్థానానికి తరలించారు.

## నల్ల చెరువును కబ్జాల నుంచి కాపాడండి : కార్పొరేటర్ రజితరెడ్డి



ఉప్పల్ నల్ల చెరువు కబ్జాలు అరికట్టాలని హైడ్రా కమిషనర్‌కు విన్నవిస్తున్న కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి తదితరులు

**ఉప్పల్, మార్చి 7 ప్రభాతవార్త :** ఉప్పల్ నల్ల చెరువును కబ్జాల నుంచి కాపాడాలని ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్‌ను కలిసి పలు అంశాలను వివరించారు. ఉప్పల్ నల్ల చెరువు 2007కు పూర్వం నిండు కుండలా ఉండేదని, చెరువు మూడు వైపులా కబ్జాలు చేశారని ఫిర్యాదు చేశారు. చెరువు పరిరక్షణకు పూర్తి స్థాయిలో సర్వే చేయాలని సూచించారు. వరంగల్ జాతీయ రహదారి పక్కన నల్ల చెరువు 120 ఎకరాల విస్తీర్ణంలో ఉండేదని, ఉప్పల్, మేడిపల్లి మండలాల పరిధిలో ఉందని, చెరువు ఎఫ్‌టిఎల్ బఫర్ జోన్‌లను రెవెన్యూ, ఇరిగేషన్, లేక్స్ విభాగం, హెచ్ఎండిఏ విభాగాల సంయుక్తంగా గుర్తించారని తెలిపారు. రెవెన్యూ విభాగం అధికారులు కబ్జాలను ఘట్‌కేసర్ అధికారులపై నెట్టివేసి చేతులు దులుపుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. బోడుప్పల్ వైపు కొందరు రాత్రికి రాత్రే మట్టిపోసి పూడ్చివేశారని, వారిపై గతంలో కేసులు బనాయించారని తెలిపారు. గత ప్రభుత్వం చెరువు అభివృద్ధికి రూ.11 కోట్లు కేటాయించిందని, చెరువు మధ్యలో నుంచి బండ్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. నల్ల చెరువు బఫర్‌లో మట్టిపోసి మందిరం నిర్మించారని, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి చెరువు కబ్జాల నుంచి రక్షించాలని కోరారు. దీనిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## జనరిక్ ఔషధ కేంద్రాలు మధ్యతరగతి ప్రజలకు వరం: ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



జనరిక్ ఔషధాలను పరిశీలిస్తున్న ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

**సరూర్‌నగర్, మార్చి 7 ప్రభాతవార్త:** వైద్యానికి సంబంధించిన మందులను తక్కువ ధరలకే పేద, మధ్యతరగతి ప్రజలకు అందించే ఉద్దేశ్యంతోనే ప్రధాని నరేంద్ర మోడి జన ఔషధీ పథకం తీసుకొచ్చి దేశవ్యాప్తంగా జనరిక్ ఔషధ కేంద్రాలకు శ్రీకారం చుట్టారని చేవెళ్ళ పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వెల్లడించారు. జన ఔషధీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మహేశ్వరం అసెంబ్లీ సెగ్మెంట్ కిందకు వచ్చే మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని లెనిన్‌నగర్ ప్రధాన రోడ్డులోనున్న జన ఔషధీ కేంద్రాన్ని సందర్శించారు. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి, జాతీయ బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా జనరిక్ ఔషధ దుకాణాలను సందర్శించాలని ఇచ్చిన పిలుపు మేరకు ఆయన మహేశ్వరం నియోజకవర్గ బిజెపి కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్, రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి, స్థానిక కార్పొరేషన్-1 బిజెపి అధ్యక్షుడు పసునూరి బిక్షపతిచారి, మాజీ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహులతో పాటు పార్టీ శ్రేణులతో కలిసి ఆయన చంద్రకళ మల్లేష్‌కు సంబంధించిన జనరిక్ మందుల దుకాణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వారి నుండి జనరిక్ మెడిసిన్స్‌లకు సంబంధించి అమ్మకాల గురించి అడిగి తెలుసుకొని పలు రకాల ఔషధాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్యం ఖరీదైన ప్రస్తుత కాలంలో జనరిక్ ఔషధ కేంద్రాలు పేదలు, మధ్యతరగతి ప్రజలకు వరంగా మారాయని అన్నారు. ఈ కేంద్రాల్లో బ్రాండెడ్‌కు సంబంధించిన వివిధ రకాల మందులు అందుబాటులో ఉంటున్నందున ప్రజలు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్-2 బిజెపి అధ్యక్షుడు తులసి ముఖేష్ ముదిరాజ్, పార్టీ నాయకులు సూల ప్రభాకర్, ఆర్.యాదగిరి యాదవ్, కీసర గోవర్ధన్‌రెడ్డి, కోడూరు సోమేశ్వర్, మద్ది రాజశేఖర్‌రెడ్డి, గాజుల మధు, ముత్తంగి కరుణానిధి, రాత్లావత్ నీలా రవినాయక్, కొంద్రు గౌరీ శంకర్, జిల్లెల అరుణ ప్రభాకర్‌రెడ్డి, బచ్చనమోని కాశీరాం యాదవ్, జగన్ ముదిరాజ్, విక్కీ సాగర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## విజిబుల్ పోలీసింగ్‌పై రాచకొండ కమిషనర్ పరిశీలన



వేలి ముద్రలను గుర్తించే పరికరాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ సుధీర్ బాబు

**సరూర్‌నగర్, మార్చి 7 ప్రభాతవార్త:** మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్‌పై రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు సమీక్ష చేశారు. మహేశ్వరం డిసిపి నూతన భవన శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన అనంతరం ఆయన గురువారం సాయంత్రం మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో ముఖ్యమైన రికార్డులను పరిశీలించి వివిధ విభాగాల పని తీరు, సిసి కెమెరాల నిర్వహణ, రిసెప్షన్ పని తీరు, పోలీసులు, పెట్రోలింగ్ పార్టీలు పని తీరుపై సమీక్ష చేశారు. ఈ మేరకు ఆయన స్థానిక ఎస్‌హెచ్ఓ కీసర నాగరాజును అడిగి వివిధ విషయాలను తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ పరిధిలో కీలకమైన నందనవనం ప్రాంతంలో కమీషనర్ వనస్థలిపురం ఎసిసి కాశీరెడ్డి, మీర్‌పేట్ ఇన్స్‌పెక్టర్ నాగరాజు, పలువురు సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజలతో మమేకమై వారి స్పందన అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా వేలి ముద్రల ద్వారా నిందితులను గుర్తించే తీరును పరిశీలించారు. ఇందులో భాగంగా సంబంధిత పరికరం పని తీరుపై పరిశీలన చేశారు. అనంతరం కమీషనర్ మాట్లాడుతూ పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నివారణ, దర్యాప్తులో ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపాలనీ ముఖ్యంగా మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యతనివ్వాలని ఆదేశించారు. పోలీసులు ఎక్కడా కూడా అహం ప్రదర్శించరాదనీ ప్రజలతో ఫ్రెండ్లీగా మెలిగి నేరాలు చేసే వారి పట్ల కఠినంగా ఉండాలని కమీషనర్ సుధీర్ బాబు సూచించారు.

## బడంగ్‌పేట్ డిఇఇ జ్యోతిరెడ్డి బదిలీ.. కొత్త డిఇఇగా వెంకన్న

**సరూర్‌నగర్, మార్చి 7 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కొత్త డిఇఇగా పి.వెంకన్న శుక్రవారం బాధ్య తలు చేపట్టారు, ఇక్కడ డిఇఇగా పని చేస్తున్న జ్యోతిరెడ్డి స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అధారిటీ (ఎస్‌యుడిఎ)కు బదిలీ అయ్యారు. అయితే ఆమె స్థానంలో మీర్‌పేట్ మున్సి పల్ కార్పొరేషన్‌లో డిఇఇగా పని చేస్తున్న వెంకన్నకు బడం గ్‌పేట్‌లో పోస్టింగ్ ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం సాయం త్రం ఆయన బడంగ్‌పేట్ కార్పొరేషన్ కార్యాలయంలో రిపోర్ట్ చేసి ఛార్జ్ తీసుకున్నారు.

## హామీలన్నీ అమలు చేస్తున్నాం : కొప్పుల నర్సింహారెడ్డి

**హయత్‌నగర్, మార్చి 7 ప్రభాతవార్త:** ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలుచేస్తున్నామని ... చివరి కాలనీవరకు కనీస సదుపాయాలను కల్పించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తానని మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా శుక్రవారం ఆయన డివిజన్ పరిధిలోని శివంహిల్స్‌లో డ్రైనేజీ, సీసీరోడ్లు లేని వీధుల్లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... శివంహిల్స్ కాలనీ పార్కు స్థలంలో 10 లక్షల వ్యయంతో ఓపెన్‌జిమ్, పవర్ బోర్ ఏర్పాటు చేసుకోనున్నట్లు తెలిపారు. రోడ్‌నెంబరు 4లో 13 లక్షల వ్యయంతో డ్రైనేజీ పైప్‌లైన్ వేయనున్నామని, మిగిలిన సీసీరోడ్లను కూడా పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సభ్యులు శ్యాంసుందర్‌రెడ్డి, కొండ శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, సత్యంరెడ్డి, నరి స్ రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, గౌతమ్ పాల్గొన్నారు.

### జనరిక్ ఔషధం ఎంతో ఉత్తమం : కార్పొరేటర్

**ఉప్పల్, మార్చి 7 ప్రభాతవార్త :** జనరిక్ ఔషదం ఎంతో ఉత్తమమైనదని, దీనిపై ఎటువంటి అపోహలు వద్దని చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్ ఆరోగ్య కేంద్రంలో జన ఔషది దినోత్సవం సందర్భంగా ఉప్పల్ ఆరోగ్య కేంద్రంలో డిఎంహెచ్ఒ డా.చంద్రశేఖర్‌తో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తక్కువ ధరకు జనరిక్ మందులు మెడికల్ షాపులలో లభిస్తాయని, వీటిని ప్రతి ఒక్కరు ఉపయోగించవచ్చని తెలిపారు. ప్రతి ఏటా ఔషది దినోత్సవం జరుపుకోవడం అభినందనీయమన్నారు. ఇతర మందుల వలే జనరిక్ మందులు కూడా అన్ని రోగాలను నయం చేస్తాయని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.సౌశిల్యారాణి, కరుణాదేవి, కెమిస్ట్ సురేష్, సూపర్‌వైజర్ బోగ ప్రకాష్, బిఆర్ఎస్ పార్టీ నేతలు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కొండల్‌రెడ్డి, శ్యామ్, బంటి తదితరులు పాల్గొన్నారు.

## ఏఎంఎస్ టెండర్ విధానాన్ని రద్దు చేయాలి : పోల్కం శ్రీనివాస్



మంత్రి శ్రీధర్ బాబుకు వినతిపత్రం సమర్పిస్తున్న పోల్కం శ్రీనివాస్ తదితరులు

**మలక్ పేట, మార్చి 7, ప్రభాతవార్త :** ఏఎంఎస్ టెండర్ విధానాన్ని రద్దు చేయాలని ఓబిసి సీనియర్ జనరల్ సెక్రెటరీ పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎఎం ఎస్ టెండర్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ పోల్కం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్ బాబుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలమండలిలో ఏ అధికారి సరిగా పనిచేయడం లేదని ఆరోపించారు. జలమండలి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఏఐసిసి ఇన్చార్జి సెక్రెటరీ మీనాక్షి నటరాజ్ తదితరుల దృష్టికి తీసుకు రావడం జరిగిందని తెలిపారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన చిన్న చిన్న కాంట్రాక్టర్లు పెండింగ్ బిల్స్ రాక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏఎంఎస్ టెండర్ విధానాన్ని రద్దు చేయాలని పలుమార్లు చెప్పినప్పటికీ పట్టించుకోవడంలేదని ఆరోపించారు. పలు కండిషన్లు పెట్టి చిన్న బడుగు, బలహీన వర్గాల కాంట్రాక్టులను వేధిస్తున్నారని పేర్కొన్నారు.

### స్నేహిత మహిళ అవార్డు అందుకున్న వీరవెల్లి జ్యోతి



వీరవెల్లి జ్యోతికి అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

**ఎల్.బి.నగర్, మార్చి 7 ప్రభాతవార్త:** కొత్తపేట చెందిన వీరవెల్లి జ్యోతి స్నేహిత మహిళ అవార్డును అందుకున్నారు. శ్రీహస్తినా మహిళా మండలి ఫౌండర్, అధ్యక్షురాలు డాక్టర్ ఎర్రం పూర్ణశాంతిగుప్తా ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాలలో అత్యుత్తమ సేవలు అందిస్తున్న మహిళలను గుర్తించి వారికి అవార్డులను అందజేశారు. అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు గాను వీరవెల్లి జ్యోతికి స్నేహిత అవార్డును నిర్వాహకులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత జ్యోతి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో అభ్యున్నతి సాధించినప్పుడే దేశం అన్ని రంగాలలో ముందుకు వెళుతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా మహిళలు అన్ని రంగాలలో పోటీ పడుతున్నారని తెలిపారు. ఈ అవార్డు తనలో మరింత బాధ్యతను పెంచిందన్నారు. ఈ సందర్భంగా పలు సాంప్రదాయ నృత్యాలను చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన మహిళలు పిఆర్.చౌదరి, సబ్ ఇన్స్పెక్టర్ తేజస్వి, డాక్టర్ గీత, కవిత, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

### సిఎం సహాయ నిధి పేదలకు వరం : ఎమ్మెల్సీ



రాజుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా

**ఎల్.బి.నగర్, మార్చి 7 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరం అని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా పేర్కొన్నారు. చైతన్యపురి డివిజన్ భవాని నగర్ కు చెందిన బచ్చు రాజు బ్లడ్ క్యాన్సర్ సమస్యతో బాధపడుతున్న విషయాన్ని ఎమ్మెల్సీ దృష్టికి తీసుకురాగా అందుకు స్పందించిన ఎమ్మెల్సీ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.3లక్షలు మంజూరు చేయించిన చెక్కును శుక్రవారం రాజుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఉపయోగపడుతుందన్నారు. అనేకమంది ఆరోగ్య సంరక్షణకు ముఖ్యమంత్రి సహాయనిధి తోడుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బొగ్గరపు శరత్‌చంద్ర గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## నిందితున్ని కఠినంగా శిక్షించాలి




అత్యాచారం చేసిన నిందితుల్ని శిక్షించాలంటూ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం...

**కుషాయిగూడ, మార్చి 7, ప్రభాతవార్త :** అత్యాచారానికి పాల్పడిన నిందితుని కఠినంగా శిక్షించాలని ఎస్.వి. రమ్మ పేర్కొన్నారు.జగిత్యాల జిల్లాలో దళిత ఆశా కార్యకర్త మీద ఫిబ్రవరి 27వ తేదీన శివరాత్రి పండుగ డ్యూటీ చేసి ఇంటికి తిరిగి వెలుతున్న సందర్భంలో జరిగిన అత్యాచారం, దాడిని సిఐటియు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కమిటిగా తీవ్రంగా ఖండిస్తూ సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె.చంద్రశేఖర్ మరియు సిఐటియు జిల్లా నాయకులు ఎం .రేవతి కళ్యాణి, బి శోభారాణి, ఏం శ్రీనివాస్ జి శ్రీనివాసులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్వి. రమ మాట్లాడుతూ నిందితున్ని వెంటనే చట్టంలోని సెక్షన్స్ ప్రకారం కఠినంగా శిక్షించాలని, బాధిత ఆశా వర్కర్ కు చట్ట ప్రకారం కాంపన్సేన్ ఇవ్వాలని మరియు ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా నాయకురాండ్లు బి వసంధి రాధా మంగ శోభ అంగన్వాడి నాయకులు బాలమణి రామ భాగ్య రేఖ పాల్గొన్నారు

## హబ్సిగూడలో సేవాలాల్ భవనం నిర్మించండి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ఉప్పల్, మార్చి 7 ప్రభాతవార్త :** హబ్సిగూడ డివిజన్ వెలుగుగుట్ట వద్ద రూ.40 లక్షల నిధులతో సేవాలాల్ భవనం నిర్మించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఐలా ఎండి విష్ణువర్ధన్‌రెడ్డిని కలిసి పలు సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ హబ్సిగూడ డివిజన్ వెలుగుగుట్ట వద్ద రూ.40లక్షల నిధులతో సేవాలాల్ భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు అయ్యాయని, భవనం నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. నిధుల మంజూరు పత్రాన్ని ఎండికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహిత కేతావత్ సోమ్‌లాల్, భీమా నాయక్, రాజు నాయక్, రవి, కిషోర్‌నాయక్, పడ్తియా నాయక్, వినోద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



వెలుగుగుట్ట వద్ద సేవాలాల్ భవనం ప్రారంభించాలని విన్నవిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

## సమాజంలో మహిళల పాత్ర మరింత పెరగాలి : కార్పొరేటర్



మహిళలను సన్మానిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, మార్చి 7 ప్రభాతవార్త:** సమాజంలో మహిళల పాత్ర మరింత పెరిగినప్పుడే సమన్యాయం చేకూరుతుందని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా డివిజన్‌లో జరిగిన పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కొత్తకాపు అరుణ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం బేటి పడావో బేటి బచావో నినాదంతో ఆడపిల్లల భవిష్యత్తు, అభివృద్ధి, సంక్షేమం గురించి ఎన్నో పథకాలు అమలు చేస్తుందన్నారు. అన్ని రంగాల్లో మహిళల ప్రాతినిధ్యం మరింతగా పెరగాల్సిన అవసరముందన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన మహిళలను ఈ సందర్భంగా కార్పొరేటర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన నేషనల్ లెవల్ టెక్నికల్ ఈవెంట్




ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులు, కళాశాల అధ్యాపకులు

**సైదాబాద్, మార్చి 7 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ వినయ్ నగర్ కాలనీలోని భోజ్ రెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన నేషనల్ లెవల్ టెక్నికల్ ఈవెంట్ జిజ్ఞాస..2025 శుక్రవారం ముగిసింది. వివిధ రాష్ట్రాలకు చెందిన 630 మంది విద్యార్థినీ విద్యార్థులు ఈ టెక్నికల్ ఈవెంట్‌లో పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెఎన్‌టియుహెచ్ యుజిసి ఎఫైర్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎ.జయలక్ష్మి మాట్లాడుతూ కఠినమైన లక్ష్యాలను సాధించడానికి స్వీయ నియంత్రణ, స్వీయ క్రమశిక్షణ చాలా అవసరమన్నారు. కళాశాల అకామిక్ డైరెక్టర్ డాక్టర్ గ్రేసి శైలశ్రీ మాట్లాడుతూ సాంకేతిక విప్లవంలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ డాక్టర్ వి.సుధ, సిఓఓ డాక్టర్ సుజాత గంగాధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జె.మాధవన్, ఉప ప్రధానోపాధ్యాయులు జి.దయాకర్‌రెడ్డి, కన్వీనర్ డాక్టర్ పి.దీప్తి, ఆర్.మంజు భార్గవి, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యార్థులను పలు రంగాల్లో ప్రోత్సహించాలి: ఎంఈవో




కల్చరల్ ఫెస్ట్‌లో విద్యార్థులతో ఎంఈవో, డైరెక్టర్

**హయత్‌నగర్, మార్చి 7 ప్రభాతవార్త:** పోటీ ప్రపంచంలో విద్యార్థులు చిన్నతనంనుంచే చదువుతో పాటు వివిధ రంగాల్లో నైపుణ్యాన్ని పెంచుకోవాలని హయత్‌నగర్ ఎంఈవో శ్రీనివాస్, గిన్నీస్ బుక్ రికార్డర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. హయత్ నగర్‌లోని మెగాసిటీ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన కల్చరల్ ఫెస్ట్‌కు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థుల ఆలోచనలకు అనుగుణంగా వారిని వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో నిష్ణాతులను చేయడానికి కృషిచేయాలని సూచించారు. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను చాలెంజ్‌గా తీసుకుని రాణించాలని సూచించారు. కల్చరల్ ఫెస్ట్‌లో విద్యార్థులు నైల్ ఆర్ట్స్, మెహందీ, ఫుడ్‌స్టాల్స్, స్కేర్‌హౌజ్, ఫన్‌గేమ్స్, థీమ్‌బేస్‌డ్ క్లాస్‌రూమ్స్, వర్కింగ్ మోడల్స్, వర్చువల రియాలిటీ ఫోటోబూత్ వంటివి తయారు చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సుబ్బారెడ్డి, రైల్వే విశ్రాంత ఉద్యోగి వి.వి.రావు, అసిస్టెంట్ డైరెక్టర్ స్వాతి, ప్రిన్సిపల్ సంకోజువాసు, వైస్ ప్రిన్సిపల్ ఎన్.స్వాతి, హైస్కూల్ ఇంఛార్జీ వెంకట నారాయణ పాల్గొన్నారు.

## మురుగు సమస్యను పరిష్కరిస్తాం: కార్పొరేటర్




కార్పొరేటర్‌కు సమస్యను వివరిస్తున్న కాలనీవాసులు

**హయత్‌నగర్, మార్చి 7 ప్రభాతవార్త:** డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి కాలనీల్లో మురుగు సమస్య లేకుండా చూస్తానని హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన డివిజన్ పరిధిలోని వాసవి, బ్లడ్‌బ్యాంక్ కాలనీలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ... కాలనీలో భూగర్భడ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు కాలనీలోని ఖాళీ ప్రదేశాల్లో చేరి దుర్గంధం, దోమలు వ్యాప్తి చెందుతున్నట్లు వివరించారు. దోమల కారణంగా కాలనీవాసులు వ్యాధుల భారిన పడుతున్నారని వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కార్పొరేటర్ స్పందిస్తూ... సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరలో డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటుకు కృషిచేస్తానని హామీనిచ్చారు. ఎంటమాలజీ సిబ్బందిని పిలిపించి మురుగు ప్రాంతంలో దోమల నివారణ మందును పిచికారి చేయించారు. కార్యక్రమంలో ఎంటమాలజీ విభాగం అధికారి రవీందర్, కుమార్, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.